


విశాలాక్షినగర్‌లో కళతప్పిన రెవెన్యూ పార్కు



పార్కులో పనిచేయని వాటర్ ఫౌంటెయిన్



విరిగిన పిల్లల జారుడుబల్ల

నాడు కళకళ.. నేడు వెలవెల

కళావిహీనంగా విశాలాక్షినగర్ రెవెన్యూ పార్కు

- తుప్పుపట్టిన ఆట పరికరాలు, బెంచీలు
- శిథిల స్థితిలో కళావేదిక
- పిల్లలు, వాకర్స్‌లో నిరుత్సాహం
- పూర్వవైభవం తేవాలని స్థానికుల విజ్ఞప్తి



నిరుపయోగంగా సెకెండ్ హ్యాండ్ ఆట పరికరాలు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లోని రెవెన్యూ పార్కు కళావిహీనంగా తయారైంది. ఒకప్పుడు సాంస్కృతిక కార్యక్రమాలతో కళకళలాడిన ఈ ఉద్యానవనం.. నేడు తన ఉనికిని కోల్పోతోంది. ఉదయం సమయంలో వాకర్స్, సాయంత్రం వేళలో సాంస్కృతిక కార్యక్రమాలు కనిపించక కొన్నేళ్లుగా బోసిపోయింది. నేటికీ ఈ పార్కు వైపు జీవీఎంసీ అధికారులు కన్నెత్తి చూడటం లేదు. ఈ ప్రాంతంలో అందరూ ఉన్నతులే. ఇక్కడ రెవెన్యూ అధికారుల కోసం ప్రత్యేకంగా కొన్ని దశాబ్దాల కిందట ప్రభుత్వం లేఅవుట్ వేసింది. దానిలోని స్థలాలను రెవెన్యూ అధికారులకు అప్పగించింది. సామాజిక అవసరాల్లో భాగంగా లేఅవుట్‌లోని సుమారు రెండెకరాల స్థలంలో పార్కు నిర్మించి రెవెన్యూ పార్కని పేరుపెట్టారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీవాసుల వాకింగ్ కోసం ఫుట్‌పాత్‌లు, సేదదీరడానికి ఇనుప బెంచీలు ఏర్పాటు చేశారు. పిల్లల కోసం వివిధ ఆట పరికరాలు అమర్చారు. పార్కులో విశాలమైన కళావేదిక నిర్మించారు. దీనిపై నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుండేవి. ఇక్కడ స్థానికులు, బయట వ్యక్తులు పండగలు, పుట్టిన రోజు, క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం వల్ల దీనికి ఆదాయం కూడా చేకూరుతుండేది. సాయంత్రం సమయంలో ఆటలాడుకోవడానికి వచ్చిన పిల్లలతో ఈ పార్కు సందడిగా ఉండేది. పార్కు మధ్యలో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వీటన్నింటితో ఒకప్పుడు కళకళలాడిన ఈ పార్కు ఇప్పుడు వెలవెలబోతోంది.

టీడీపీ నాయకుల ఆటంకం

రెవెన్యూ పార్కును పునరుద్ధరించాలని ఇటీవల పార్కు కమిటీ సభ్యులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబును కలిశారు. ఆయన స్పందించి జీవీఎంసీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆట పరికరాలు ఏర్పాటు చేయడానికి జీవీఎంసీ అధికారులు ముందుకొచ్చారు. ఇందులో భాగంగా ముందుగా కొన్ని ఆట పరికరాలను తీసుకొచ్చి పార్కులో ఉంచారు. అవి సెకెండ్ హ్యాండ్‌వి కావడం విశేషం. ఎక్కడో వినియోగించిన పరికరాలను తెచ్చి ఇక్కడ ఏర్పాటు చేయడానికి సిద్ధం చేశారు. వాటికి కూడా కొందరు స్థానిక టీడీపీ నాయకులు ఆటంకం కలిగిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక నాయకులకు తెలియకుండా రెవెన్యూ పార్కు కమిటీ ప్రతినిధులు నేరుగా ఎమ్మెల్యేను కలవడంతో ఆట పరికరాలు ఏర్పాటు చేయకుండా ఆటంకాలు సృష్టిస్తున్నారు. దీంతో సుమారు మూడు వారాలుగా ఈ పరికరాలను నిరుపయోగంగా వదిలేశారు. పాలకులు, అధికారులు స్పందించి ఈ పార్కును అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



శిథిలమైన కళావేదిక పైకప్పు

పార్కు పరిసరాలు అస్తవ్యస్తం

పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు తుప్పుపట్టి విరిగిపోయాయి. పెద్దలు సేదదీరే ఇనుప బెంచీలు పాడయ్యాయి. వాటర్ ఫౌంటెయిన్ పనిచేయడం లేదు. సాయంత్రం వేళలో దీని నుంచి పైకి చిమ్మే రంగుల నీరు, మ్యూజిక్ మాయమయ్యాయి. నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే కళావేదిక పైకప్పు తుప్పుపట్టింది. దాని గోడల పెచ్చులు ఊడిపోయాయి. ఫుట్‌పాత్‌ల మధ్యలో పలకలు ఎగిరిపోయాయి. పార్కులో కొన్నిచోట్ల పిచ్చి మొక్కలు దట్టంగా మొలిచాయి. చెట్లు ఆకులు, కొమ్మలతో అస్తవ్యస్తంగా మారిపోయింది. ఆటపాటలు, వాకింగ్‌కు అవకాశం లేక పోవడంతో స్థానిక చిన్నారులు, వాకర్స్‌లో నిరుత్సాహం నిండింది.



పిచ్చిమొక్కలు, చెట్ల ఆకుల మధ్య తుప్పపట్టిన ఆట పరికరాలు, బెంచీలు

క్లుప్తంగా

హాకీ పోటీలకు క్రీడాకారిణుల ఎంపిక



ఏయూ హాకీ జట్టుతో అధికారులు

విశాఖ విద్య: మహిళల హాకీ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనేందుకు శనివారం ఆంధ్రా యూనివర్సిటీ క్రీడాకారిణుల ఎంపిక జరిగింది. ముఖ్య అతిథి ఏయూ ఎడ్యుకేషన్ విభాగం హెడ్ ఆచార్య టి.షారోన్‌రాజు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వ్యాయామ విద్యా విభాగం డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్, హెడ్ ఆచార్య ఎ.పల్లవి వర్సిటీ విద్యార్థినులు విరివిగా క్రీడల్లో పాల్గొనే విధంగా కృషి చేస్తున్నారని అభినందనలు తెలిపారు. ఈ హాకీ పోటీల్లో పాల్గొనే విద్యార్థినులు క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ మెంబర్ డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల పీడీ డాక్టర్ లక్ష్మణరెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ దుర్గారావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూజీడీకి మరమ్మతులు



యూజీడీ మరమ్మతులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 20వ వార్డు శివాజీపాలెం, చిన్న పోలమాంబ దేవాలయ ప్రాంతాల్లోని యూజీడీలకు శనివారం మరమ్మతులు చేపట్టారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ మువ్వల లక్ష్మీ సురేష్ జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. జీవీఎంసీ సిబ్బంది చేపట్టిన మరమ్మతు పనులను ఆమె స్వయంగా పర్యవేక్షించి పలు సూచనలిచ్చారు.

ఐఎన్ఎస్ కల్వరి వద్ద చిన్నారుల సందడి



ఐఎన్ఎస్ కల్వరి జలాంతర్గామి వద్ద కేరింతలు కొడుతున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులోని ఐఎన్ఎస్ కల్వరి జలాంతర్గామి వద్ద చిన్నారులు సందడి చేశారు. శనివారం విశాఖ మ్యూజియంను సందర్శించడానికి విచ్చేసిన పాఠశాల విద్యార్థులు కొద్దిసేపు దేశ తొలి జలాంతర్గామి ఐఎన్ఎస్ కల్వరి వద్ద ఆడిపాడారు. అక్కడున్న టార్పెడోల నమూనాల వద్ద ఫొటోలు తీసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు జలాంతర్గామి ప్రత్యేకత, విశిష్టతను చిన్నారులకు వివరించారు. అనంతరం చిన్నారులు మ్యూజియంను సందర్శించారు.

ధనుర్మాసోత్సవాలకు సిద్ధం



ధనుర్మాసోత్సవాలకు ముస్తాబవుతున్న త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయం



తులసిమాలల అలంకరణలో వెంకన్న

మద్దిలపాలెం: ఈ నెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయాలను నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. ప్రత్యేక పూజలకు సర్వం సిద్ధం చేశారు. ఎంఎంటీసీ కాలనీలోని త్రిమూర్తిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యదర్శి ఎం.సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజర్ బి.సన్యాసిరావులు తెలిపారు. ఆలయ అర్చకులు వెంకటరమణాచార్యులు, గోపాలకృష్ణ ప్రతి రోజు ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. సోమవారం ఉదయం 6.57 గంటలకు ధనుర్మాస వ్రతం(నెలగంట)తో ఉత్సవాలు ప్రారంభమై.. వచ్చే జనవరి 18 వరకు కొనసాగుతాయని చెప్పారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు, ఉత్తర ద్వార దర్శనంతో పాటు గోదా అమ్మవారి అభిషేకం, తోమాలసేవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 11న స్వామి వారికి కుదార్రై ఉత్సవం, 13న గోదా అమ్మవారి కల్యాణంతో ధనుర్మాసోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. ప్రతి శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో హరికథ, డాక్టర్ శారద సుబ్రహ్మణ్యంచే భక్తి కీర్తనలు, చైతన్య బ్రదర్స్‌తో అన్నమాచార్య గానామృతం, రఘునాథచే అన్నమాచార్య కీర్తనల కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

- కొత్త వెంకోజీపాలెం వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్టు అర్చకుడు కిషోర్ శర్మ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం



మాట్లాడుతున్న అరవా పాల్

బీచ్‌రోడ్డు: ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అరవా పాల్ పిలుపునిచ్చారు. పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో శనివారం ఈసీ సభ్యులు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ద్వారా సిబ్బందికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను పోరాడి సాధించుకోవాలన్నారు. సిబ్బంది సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి వాటిని తీసుకెళ్లి పరిష్కార మార్గాలు అన్వేషిస్తామని చెప్పారు. ఇంసా అసోసియేషన్ గుర్తింపు పొందిన అసోసియేషన్‌గా గుర్తుచేశారు. కార్యక్రమంలో జోన్ కో ఆర్డినేటర్ డి.సూరిబాబు, జిల్లా అధ్యక్షుడు డి.చినబాబు, జిల్లా కార్యదర్శి ఎన్.బాబీ, పబ్లిసిటీ సెక్రటరీ ఎన్.వి.గణేష్ పాల్గొన్నారు.

దుబాయ్‌లో పెట్టుబడులపై సదస్సు



మాట్లాడుతున్న గణేష్ రాయిపూడి

విశాఖ విద్య: ఇండస్ట్రీ–స్టూడెంట్ కనెక్ట్‌లో భాగంగా ఆంధ్రా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌తో కలిసి ఏపీ చాంబర్స్ శనివారం పీటర్ ఎఫ్ డ్రక్కర్ స్మార్ట్ సెమినార్ హాల్‌లో సదస్సు నిర్వహించారు. ఇండెక్స్ ఎమిరేట్స్ గ్రూప్, దుబాయ్ సీఎండీ గణేష్ రాయపూడితో ఇంటరాక్టివ్ సెషన్ ఏర్పాటు చేశారు. దుబాయ్‌లో పెట్టుబడులు, వ్యాపార అవకాశాలపై వివరణాత్మక ప్రదర్శనను ఆయన అందించారు. దుబాయ్‌లో అభివృద్ధి చెందుతున్న రియల్ ఎస్టేట్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, ప్రింటింగ్, టూరిజం, హాస్పిటాలిటీ అగ్ర రంగాల గురించి మాట్లాడారు. విశాఖపట్నం జోన్ వైస్ చైర్మన్ పి.శోభ ప్రకాష్ స్వాగతోపన్యాసం చేస్తూ విశిష్ట ఆలోచనలతో ముందుకు సాగే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అనేక వ్యాపార అవకాశాలున్నాయన్నారు. ఏపీ చాంబర్స్ మాజీ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్, ప్రొఫెసర్ బి.మోహన్ వెంకటరామ్, కో ఆర్డినేటర్, ప్రకాష్, కుమార్ రాజా, వాణిజ్య విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

రెండేళ్లలో 100 బీమా ఏజెన్సీ బ్రాంచ్‌లు

బీచ్‌రోడ్డు: దేశంలో బీమా రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, రాబోయే రెండేళ్లలో దేశ వ్యాప్తంగా 100 ఏజెన్సీ బ్రాంచ్‌లు ఏర్పాటు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని ఇండియన్ ఫస్ట్ లైఫ్ ఎండీ రుషబ్ గాంధీ తెలిపారు. విశాఖ బ్రాంచ్ సలహాదారుల నియామకం వివరాలను శనివారం మీడియాకు వివరించారు. బ్రాంచ్‌ల విస్తరణలో భాగంగా సలహాదారులను నియమించనున్నట్లు చెప్పారు. బ్రాంచ్‌ల ఏర్పాటు నిరుద్యోగులకు మంచి అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఈ చర్య ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. ఏజెన్సీ నిర్మాణ్ పేరుతో విశాఖతోపాటు దేశ వ్యాప్తంగా 18 కొత్త బ్రాంచ్‌లు ప్రారంభించామని తెలిపారు. ఈ రెండేళ్లలో ఏర్పాటు చేసే ఏజెన్సీ బ్రాంచ్‌ల ద్వారా వెయ్యి మందికి పైగా ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నామన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం హత్యాయత్నం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. చినవాల్తేరుకు చెందిన దుర్గాప్రసాద్ 2022లో శ్రావణి అనే యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఏడాది తర్వాత వారి మధ్య గొడవలు రావడంతో అతడిపై వేధింపుల కేసు పెట్టారు. కొన్ని నెలలు మౌనంగా ఉన్న దుర్గాప్రసాద్ కొంత కాలంగా శ్రావణి ఇంటికి వెళ్లి చంపేస్తానని బెదిరిస్తూ దాడికి యత్నించాడు. దీంతో ఆమె దుర్గాప్రసాద్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీరరాఘవులకు డాక్టరేట్

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం పరిశోధక విద్యార్థి తముకుల వీరరాఘవులుకు డాక్టరేట్ లభించింది. విభాగం ద్వారా 'ప్రింట్ మీడియాలో షెడ్యూల్డ్ క్యాస్ట్‌ల వార్తా కవరేజ్' అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను రాఘవులకు ఏయూ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. విభాగ ఆచార్యుడు, ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఆచార్య డి.వి.ఆర్.మూర్తి పర్యవేక్షణలో రాఘవులు పరిశోధనలు సాగాయి. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు తన కార్యాలయంలో శనివారం రాఘవులుకు డాక్టరేట్ ఉత్తర్వులు అందజేసి అభినందించారు.

గందరగోళంగా రెవెన్యూ సదస్సు



గుంపుగా వచ్చి రూరల్ తహసీల్దార్ పాల్‌కిరణ్‌కు దరఖాస్తులు అందిస్తున్న స్థానికులు



చిన్న స్థలంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు రవీంద్రనగర్‌లో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సు గందరగోళంగా మారింది. సమస్యలపై దరఖాస్తులు చేయడానికి స్థానికులు అధిక సంఖ్యలో రావడంతో హడావుడి నెలకొంది. రూరల్ మండలంలో ఆరిలోవ రెవెన్యూ పరిధి 9, 10, 11 వార్డులకు సంబంధించి రవీంద్రనగర్ ఆఖరి బస్టాప్ వద్ద నిర్మాణంలో ఉన్న ఓ కల్యాణ మండపంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, తహసీల్దార్ పాల్‌కిరణ్, జీవీఎంసీ జోన్–2 కమిషనర్ ఫణికుమార్, 9, 10 వార్డుల కార్పొరేటర్లు ఉమ్మడి స్వాతి, మద్దిల రామలక్ష్మి హాజరయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సు ప్రాధాన్యం గురించి తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికుల రెవెన్యూ సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి 45 రోజుల్లో పరిష్కరిస్తామని, ఎవరైనా తమ సమస్యలను దరఖాస్తు ద్వారా తహసీల్దార్‌కు అందజేయాలని సూచించారు. కార్పొరేటర్లు మాట్లాడుతూ వారి వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యలను ఎమ్మెల్యే, అధికారులకు వివరించారు.

టీడీపీ శ్రేణుల హడావుడి

అంతవరకు బాగానే ఉన్నా.. ప్రజాప్రతినిధుల ఉపన్యాసాల అనంతరం రెవెన్యూ సమస్యలపై దరఖాస్తులు అందజేయడానికి స్థానికులు పెద్ద సంఖ్యలో అధికారుల వద్దకు చేరుకున్నారు. తోపులాటల మధ్య అధికారులు దరఖాస్తులు స్వీకరించాల్సి వచ్చింది. సదస్సులో ఎక్కువ మంది కనిపించాలనే తపనతో స్థానిక టీడీపీ నాయకులు చిన్న కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానికుల కంటే టీడీపీ కార్యకర్తలే ఎక్కువ సంఖ్యలో అక్కడికి చేరుకొని హడావుడి చేశారు. ఎమ్మెల్యే వెలగపూడికి కనిపించి హాజరు వేసుకోవాలనే ఆలోచనతో టీడీపీ కార్యకర్తలు దరఖాస్తులు చేసుకునే వారిని పక్కకు నెట్టేసి ముందుకు దూసుకుపోవడంతో గందరగోళం నెలకొంది. బయట వారు రోడ్డుపై నిలిపిన వాహనాలతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఇరుకు ప్రదేశంలో సదస్సు ఏర్పాటు చేయడంతో ఇబ్బంది పడాల్సి వచ్చిందని స్థానికులు వాపోయారు. సోమవారం టీఐసీ పాయింట్ వద్ద జరగాల్సిన రెవెన్యూ సదస్సులో ఇది పునరావృతం కాకుండా అధికారులు జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు.

మానవతా విలువలతో కూడిన విద్య అవసరం



స్కూల్ మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ తదితరులు



నృత్య ప్రదర్శనలో విద్యార్థినులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–8లోని శ్రీ సత్యసాయి విద్యా విహార్ 39వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి.. స్కూల్ ఉన్నతాధికారులతో కలిసి జ్యోతి వెలిగించి వేడుకలు ప్రారంభించారు. స్కూల్ విద్యార్థులకు చెందిన పలు కార్యక్రమాలతో కూడిన మ్యాగజైన్ 'స్కూల్ ప్లాష్'ను ఆయన ఆవిష్కరించారు. చదువు, క్రీడలు, ఇతర కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సీపీ పతకాలు అందజేశారు. మానవతా విలువలతో కూడిన విద్యను అందిస్తున్న శ్రీ సత్యసాయి విద్యావిహార్ యాజమాన్యాన్ని కమిషనర్ అభినందించారు. సత్యసాయిబాబా సూచనలు అనుసరిస్తూ విద్యావిహార్ విద్యార్థులు అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. 18 శక్తిపీఠాల ఆవిర్భావాన్ని ఆవిష్కరిస్తూ చేసిన నృత్యం, చిల్డ్రన్ ఆఫ్ వరల్డ్, నారీ శక్తి నాటకం వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చేకూరి వరలక్ష్మి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఆర్గానిక్ మేళా



ఆర్గానిక్ మేళాలో ఆకట్టుకుంటున్న స్టాల్



వరికంకులు చూపిస్తున్న విద్యార్థిని

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కాలేజ్ మైదానంలో నిర్వహిస్తున్న ఆర్గానిక్ మేళా అందరినీ ఆకట్టుకుంటుంది. ఇక్కడ కొబ్బరి ఆకులతో పెళ్లి పందిరిలా స్టాల్ ఏర్పాటు చేసి బంతి పూలతో సుందరంగా అలంకరించారు. ఈ స్టాల్‌లో ఆర్గాన్ ఉత్పత్తులు, డ్రైఫ్రూట్స్, పాత తరానికి చెందిన ఇత్తడి వస్తువులు, రాతి రోకళ్లు, రాతి రోళ్లు, సన్ని కాళ్లు, క్యాస్ట్ ఐరన్ వస్తువులు, మట్టి పాత్రలు, మట్టి గ్లాసులు, చెక్కతో తయారు చేసిన పలు వస్తువులు, ఇంటిల్లపాది ఉపయోగించే అనేక రకాల వస్తువులతో సత్త్వ నేచురల్స్ అందరినీ ఎంతో ఆకర్షిస్తోంది. అంతరించిపోతున్న పిచ్చుకలు, పావురాలను కాపాడుకుని పర్యావరణాన్ని పరిరక్షించుకునే సదుద్దేశంతో రైతుల నుంచి వరికంకులు సేకరించి అదే ధరకు కస్టమర్లకు సత్త్వ నేచురల్స్ స్టోర్ యాజమాన్యం, నిర్వాహకులు పంపిణీ చేస్తున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



విద్యార్థినికి రక్త పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

మద్దిలపాలెం: అపార్ ఐడీ క్రియేషన్‌లో భాగంగా హోలిస్టిక్ కార్డు నమోదు కోసం 15వ వార్డు జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది రెండు రోజులుగా విద్యార్థులకు ఉచితంగా బ్లడ్ గ్రూప్ పరీక్షలు చేస్తున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అధ్వానంగా పెదవాల్తేరు రైతుబజార్



పెదవాల్తేరు రైతుబజారు వద్ద పేరుకుపోయిన చెత్త

బీచ్‌రోడ్డు: పచ్చని ఆకు కూరలు, తాజా కూరగాయలు లభించే పెదవాల్తేరు రైతుబజార్ పరిసరాలు కొంత మంది నిర్లక్ష్యం వల్ల అధ్వానంగా తయారైంది. బజారు ఆవరణలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసనలు వెదజల్లుతోంది. బజారు వెనుక వైపు ఉన్న ప్రాంతంలో పెద్ద మొత్తంలో చెత్తను డంప్ చేయడంతో అది కుళ్లిపోయి కంపుకొడుతోంది. రైతుబజారుకు వస్తున్న వినియోగదారులు ముక్కు మూసికుని కూరగాయలు కొనుగోలు చేస్తున్నారు..అక్కడ చెత్త వేసేందుకు జీవీఎంసీ డస్ట్ బిన్లు ఏర్పాటు చేసింది. అవి నిండిన సరే వాటిని పారిశుధ్య కార్మికులు తీసుకొని వెళ్లకపోవడంతో చెత్త పేరుకుపోయింది. దీంతో రైతుబజార్ ప్రాంతమంతా చెత్తతో నిండిపోయింది. శానిటరీ అధికారులు స్పందించి శుభ్రతా చర్యలు చేపట్టాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు.